# సంధి కుదిరింది



స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజయ్యను కాదని కడియం శ్రీహరికి సీటు ఖరారు చేయడంతో నియోజకవర్గంలో కొంత కాలంగా గందరగోళం నెలకొంది. సమయం దొరికిన ప్రతీసారి శ్రీహరిని టార్గెట్ చేస్తూ రాజయ్య సెటైర్లు వేశారు. పరోక్షంగా శ్రీహరిని ఓడిస్తానంటూ శపథం చేశారు. తాజాగా ప్రగతి భవన్‌లో రాజయ్య, శ్రీహరితో మంత్రి కేటీఆర్ సమావేశమై రాజయ్యను శాంతింపజేశారు. దీంతో వచ్చే ఎన్నికల్లో పార్టీ కోసం, కడియం గెలుపునకు పనిచేస్తానంటూ రాజయ్య ప్రకటించారు. ఈ భేటీలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

– వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్


వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 81 | శుక్రవారం | 22 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


# రెచ్చిపోతున్న.. మైనింగ్ మాఫియా

- మానుకోటలో అడ్డూ అదుపూ లేని దందా
- మంత్రి అండదండలతో నిబంధనలకు పాతర
- ప్రజలనుంచి ఫిర్యాదు అందినా పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా నోటీసులు.. మొక్కుబడిగా తనిఖీలు





వివరాలు 2లో..

మానుకోటలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న దందాతో విలువైన సంపద కొల్లగొడుతున్నారు. మాఫియా రాయుళ్లు నిబంధనలకు పాతరేస్తున్నారు. క్వారీ యజమానుల ధన దాహానికి కొండలు సైతం పిండి అవుతున్నాయి. ఇష్టారాజ్యంగా గుట్టలను పేల్చివేస్తూ పర్యావరణాన్ని పాడు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అక్రమ మైనింగ్‌తో వందల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అవినీతి మత్తులో జోగుతున్న మైనింగ్ శాఖ అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు. మొక్కుబడి తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. అయితే ఈ అక్రమ మైనింగ్ వెనుక రాష్ట్ర మంత్రి ఒకరు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న విమర్శలున్నాయి. - వరంగల్ వాయిస్, మహబూబాబాద్

## 572 కిలోల పసుపుతో.. అతిపెద్ద గౌరమ్మ

వైభవంగా జ్యేష్టాదేవి పూజ



2లో..





2లో

## సబ్బండ కులాల సంక్షేమమే లక్ష్యం

- తొర్రూరులో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కృషి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- రూ.2 కోట్లతో ఆధునిక దోబీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన



8లో

## గోడ కూలి ముగ్గురు మృతి

- శాయంపేటలో విషాద ఛాయలు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చైర్ పర్సన్ గండ్ర జ్యోతి

# రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా



**మానుకోటలో అడ్డూ అదుపూ లేని దందా**

**మంత్రి అండదండలతో నిబంధనలకు పాతర**

**ప్రజలనుంచి ఫిర్యాదు అందినా పట్టించుకోని అధికారులు**

**తూతూ మంత్రంగా నోటీసులు.. మొక్కుబడిగా తనిఖీలు**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాలో అక్రమ మైనింగ్ అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. ఇష్టారాజ్యంగా గుట్టలను తొలుస్తూ, గనులను తవ్వుతూ తమ దందాను కొనసాగిస్తున్నారు. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్నట్లుగా మైనింగ్ దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. అక్రమ మైనింగ్‌తో వందల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. అనుమతులు లేకుండా సాగుతున్న ఈ వ్యవహారంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా బయటి ప్రపంచానికి తెలియకుండా మేనేజ్ చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన వేల కోట్ల ఆదాయం అక్రమార్కులపాలవుతోంది. అవినీతి మత్తులో జోగుతున్న మైనింగ్ శాఖ తూతూ మంత్రంగా నోటీసులు..మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. దీంతో రెచ్చిపోతున్న క్వారీ యజమానుల ధనదాహానికి గుట్టలు కరిగి పోతున్నాయి.

## మంత్రి అండతో..

మహబూబాబాద్ జిల్లాకు అతి సమీపంలో ఉన్న తాళ్లపూసపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఓం నారాయణ బావి సమీపంలో నిర్వహిస్తున్న క్వారీలో అంతులేని అక్రమాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. రాష్ట్ర మంత్రి అండదండలతో మూడు గుట్టలు..ముప్పై టిప్పర్లు అన్నట్లుగా దందా సాగిస్తున్నారు. వేసవికాలంలో గుట్టను తొలిచి విలువైన గ్రానైట్ ను ఎక్స్ పోర్ట్ చేస్తుండగా వర్షాకాలంలో క్వారీలో లభిస్తున్న మొరం విక్రయిస్తూ వేల కోట్లు కూడబెడుతున్నారు. కేసముద్రం మండలం తదితర ప్రాంతాల్లోని క్వారీల్లోనూ అనేక అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. మైనింగ్ మాఫియా ఇష్టారాజ్యంగా గుట్టలను పేల్చివేయడంతో పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. ప్రజలు వాయు, జల కాలుష్యంతో విలవిలలాడుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. క్వారీల నుంచి ఎగిరిపడ్డ రాళ్లు తగిలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మైనింగ్ మాఫియాపై పత్రికలు కోడై కూస్తున్నా, వరుస కథనాలు ప్రచురితమవుతున్నా మైనింగ్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా అనిపించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## అధికార పార్టీవారే..

క్వారీ యజమానులంతా అధికార పార్టీకి చెందినవారు కావడంతో మైనింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తు న్నారన్న ప్రచారం సాగుతోంది. మైనింగ్ శాఖ నివేదికను బట్టి చూస్తే బడాబాబులు, రాజకీయ అండదండలు ఉన్న సంపన్నుల గుప్పిట్లోనే క్వారీలు నడుస్తున్నట్టు స్పష్టమవుతోంది. క్వారీల నిర్వహణలో సామాన్యులకు చోటే లేదు. అవకాశమూ అంతకన్నా లేదు. అన్ని అనుమతులను తీసుకొని క్వారీలను ఎవరైనా నిర్వహించవచ్చు. కానీ ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులే వాటిని గుప్పిటపట్టిన తర్వాత ఆ దరిదాపుల్లోకి ఇతరులెవ్వరూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

## నిబంధనలకు పాతర

గ్రానైట్, కంకర క్వారీలు, క్రషర్లు నిర్వహించాలంటే పర్యా వరణ శాఖ, అగ్నిమాపక శాఖ, గనుల శాఖ అనుమతులు తప్పనిసరి. తవ్వకాలకు పరిధి ఉంటుంది. అయితే క్వారీ, క్రషర్ల నిర్వాహకులు చాలామంది నిబంధనలు పాటించడం లేదన్న ఫిర్యాదులున్నాయి. క్వారీల నిర్వాహకులు తమకు కేటాయించిన స్థలంలో కాకుండా మరోచోట తవ్వకాలు చేస్తున్నారు. అనుమతించినదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా టోకరా వేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసేంత వరకు మైనింగ్ శాఖ అధికారులు కదలడం లేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా తనఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. అధికార పార్టీకి చెందినవారైతే అటువైపు చూసేందుకే జంకుతున్నారు.

## ఇష్టారాజ్యంగా..

మహబూబాబాద్ జిల్లాలో మైనింగ్ పేరుతో గుట్టలను ఇష్టారాజ్యంగా గుల్ల చేస్తున్నారు. బలమైన మందు గుండు సామగ్రితో పేల్చడంతో ఆ ప్రకంపనలకు గ్రామాలు కంపించి పోతున్నాయి. ఇళ్లు బీటలు వారు తున్నాయి. బండరాళ్లు పడి వ్యవసాయ పొలాలు దెబ్బతింటున్నాయి. రాళ్లు తగిలి స్థానికులు గాయపడుతున్నారు. వ్యాధికారక రసాయనాలు గాలి, నీరులో కలిసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి. పెద్ద పెద్ద బండలు పడటం, దుమ్ము, ధూళి కారణంగా పంటల దిగుబడి తగ్గిపోతోందని, క్వారీ కోసం లోతుగా తవ్విన గుంతల్లో పడి పశువులు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టి అక్రమ మైనింగ్ కు ఫుల్ స్టాప్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# సబ్బండ కులాల సంక్షేమమే లక్ష్యం

### తొర్రూరులో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కృషి

### మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

### రూ.2 కోట్లతో ఆధునిక దోభిఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సబ్బండ కులాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రకటించారు. శుక్రవారం తొర్రూరులో రూ. 2 కోట్లతో నిర్మించనున్న ఆధునిక దోభిఘాట్ తోపాటు బుడిగ జంగాల సంక్షేమ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొర్రూరు పట్టణంలో బుడగజంగాలు భారీగా తరలి వచ్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి స్వయంగా బైక్ నడిపి యువకులను ఉత్తేజపరిచారు. ఎద్దుల బండిపై మంత్రిని ఊరేగిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తొర్రూరులోని రామా ఉపేందర్ గార్డెన్ లో జరిగిన సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొర్రూరులో బుడగ జంగాలకు ఎకరం స్థలంలో సంక్షేమ భవన్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ అన్ని కులాల ప్రజలను సమంగా చూస్తున్నారన్నారు. అడుగంటిపోయిన కులవృత్తులకు ఆయ పునర్జీవం పోశారన్నారు. ఆయా కులాల వృత్తుల ప్రాధాన్యతలను బట్టి వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. రజక సంక్షేమ భవనాన్ని కూడా త్వరలోనే నిర్మిస్తానన్నారు. తొర్రూరు పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటుకు కృషి చేస్తానని వెల్లడించారు. బుడిగ జంగాలు మొదటి నుంచి తనకు అండగా నిలబడ్డారని, వారు మాట ఇస్తే తప్పరన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ శశాంక, స్థానిక ప్రజా ప్రతినిధులు, రజక, బుడగ జంగాల సంఘాల సామాజిక వర్గాల ప్రముఖులు, బాధ్యులు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులపై సీరియస్

### చర్యలు చేపట్టాలంటూ మేయర్ ఆదేశం

### శానిటేషన్, మలేరియా అధికారులు, సిబ్బందితో సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మలేరియా, డెంగీతోపాటు ఇతర కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో శానిటేషన్, మలేరియా అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం, మురికి కాలువలు శుభ్రం చేయడం నిరంతరం సాగాలన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ లు, హెల్త్ ఇన్స్పెక్టర్ లు సమన్వయంతో పర్యవేక్షించాలని, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలుకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ సాంబయ్య, భాస్కర్, నరేందర్ తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ లు,హెల్త్ ఇన్స్పెక్టర్ లు,హెల్త్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

### 572 కిలోల పసుపుతో..

# అతిపెద్ద గౌరమ్మ

### వైభవంగా జ్యేష్టాదేవి పూజ

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం రోజున జ్యేష్టాష్టమిని పురస్కరించుకొని అతిపెద్ద గౌరమ్మను తయారుచేసి మహిళలంతా సామూహికంగా పూజలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సేకరించిన 572 కిలోల పసుపుతో ఐదున్నర ఫీట్ల ఎత్తులో గౌరమ్మను తయారు చేశారు. దేవాలయ వైదిక కార్యక్రమ నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు కె.రమాదేవి, రజిత, అనురాధ, ఉమాదేవి, సాయి కుమారి, శ్రీనమ్మ, విజయలక్ష్మి, విజయ కోటి, సులోచన, సుజాత, సరోజన తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ కార్యక్రమాల ఇన్చార్జి తుమ్మ శ్రీనివాస్, మహోత్సవ ఇన్చార్జి కమటాల భాస్కరరావు, దేవాలయం మేనేజర్ లక్క రవి శ్రీనివాస్, పీఆర్ఓ నిధి శ్రీనివాసరావు-పద్మ తదితరులు భక్తులకు అన్నదానం చేశారు.

## గురుకులాల్లో మిగిలిన సీట్లకు రేపు కౌన్సిలింగ్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో 5 నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 23న ఎస్సీ బాలబాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటీజీ సెల్-23, బీఎల్వీ సెల్-23లో ప్రతిభ చూపి, సీటు వచ్చి జాయిన్ కాలేని వారు, ఎస్సీ కేటగిరీలో అర్బన్, సెమీ అర్బన్, దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. విద్యార్థులు సీటు వచ్చిన కాపీ, హాల్ టికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో ఈనెల 23న బాలికలు చింతకుంట గురుకుల పాఠశాలలో, బాలురు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (అల్గునూర్)లో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

## గణనాథుడికి పంచామృత అభిషేకం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గ చౌరస్తాలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పంచామృతాభిషేకం పూజలు నిర్వహించి, కర్పూర హారతులతో ఘనంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి పరపతి సంఘ అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, దాసి శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి మండల సురేష్ కుమార్, కోశాధికారి ఆదికిరణ్, సహాయ కోశాధికారి కొలిపాక మహేశ్వర్, మామిడాల సతీష్, దుస్స కృష్ణ, సహాయ కార్యదర్శి పసునూటి శ్రీకాంత్, మండల చంద్రశేఖర్, క్యాతం శ్రీనివాస్, ఆర్గనైజర్స్ జూలూరి నాగరాజు, బండారి లక్ష్మణ్, సిందం కృష్ణ, గౌరవ సలహాదారులు లింగ బత్తుల ఆనంద్, గాదె జగన్, వంగరి రవి, బండారి రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బండారి భాస్కర్, గోనె సతీష్, కానుగంటి పవన్, పోత్కనూరు రాజు, గాజుల రాజేష్, నల్ల కృష్ణ, చిమ్మని వికాస్, ములుక సురేష్, క్యాతం రవీందర్, వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'ఫీజు దీక్ష'




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పెండింగ్ లో ఉన్న రూ.5177కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్స్ ను విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో "ఫీజు దీక్ష"ను శుక్రవారం ప్రారంభించారు. మానుకోట పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఈ ఫీజు దీక్షను ఆకుల రాజు ప్రారంభించడం జరిగింది. ప్రజా సంఘాల నాయకులు కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి మద్దతు తెలిపారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ని తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే భారీ ఆందోళన కార్యక్రమం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్, జిల్లా అధ్యక్షులు పట్ల మధు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్ష లో డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్యప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, జిల్లా నాయకురాలు మహేశ్వరి, మమత, సౌమ్య, తరుణ్, మనోజ్, హేమంత్, మధుకర్, శ్రవ్య, వెంకటేష్, నవీన్, అరుణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## 27న గణేష్ నిమజ్జనం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డా.పాల్వాయి రాంమోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, తహశీల్దార్ ఇమ్మాన్యుయేల్, టౌన్ సీఐ సతీష్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27న బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని నిజాం చెరువు వద్ద గణేష్ నిమజ్జనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్ లో స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణంలో సుమారు 200 విగ్రహాలు ఏర్పాటు చేసినందున నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, త్వరగా జరిగేందుకు ఉత్సవ కమిటీ వారు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ ఉపేందర్, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్ధన్ , సూర్ణపు సోమయ్య, కౌన్సిలర్లు మార్నేని వెంకన్న, పోతరాజు రాజు, ఏఈ సురేష్, సానిటరీ ఇన్ స్పెక్టర్లు శ్రీహరి, రాజేష్ పాల్గొన్నారు.

# పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యం




### నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, భారత ప్రభుత్వం స్పాన్సర్ చేసిన "రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఇం సోషల్ సైన్సెస్"పై పది రోజుల వర్క్షాప్ శుక్రవారం ఉదయం నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్స్ కాంప్లెక్స్‌లోని రామన్ హాల్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించింది. ప్రొఫెసర్ బి.రాజ శేఖర్, ప్రొఫెసర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, (విశిష్ట అతిథి) తన ప్రసంగంలో మంచి నాణ్యమైన పరిశోధన ప్రచురణలపై మాట్లాడారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు నెట్‌వర్కింగ్ నైపుణ్యాలను పెంపొందిస్తాయని, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహిస్తాయని అన్నారు. నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తన ప్రసంగంలో పరిశోధన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మనం జీవిస్తున్న సమాజంలోని సమస్యల పరిష్కారానికి పరిశోధకులు పని చేయాలి అన్నారు. పది రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

టెక్నాలజీలో ముందున్న నిట్ వరంగల్ ఇన్‌స్టిట్యూట్‌లో మేనేజ్‌మెంట్ పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని టెక్నోక్రాట్‌లు వారి భవిష్యత్‌లో మెరుగైన మేనేజర్‌లుగా మారడంలో సహాయపడటానికి ఆ దిశగా కృషి చేస్తామని ఆయన అన్నారు.

స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ వి.రమాదేవి విభాగాన్ని సమీక్షించారు. ఈ కోర్సుకు 150 దరఖాస్తులు వచ్చాయని, అందులో 30మంది రీసెర్చ్ స్కాలర్‌లు పది రోజులపాటు జరిగే వర్క్‌షాప్‌కు హాజరయ్యేందుకు ఎంపికైనట్లు ప్రొఫెసర్ పి.రామ్‌లాల్ కోర్స్ కార్డినేటర్ తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి. సునీత కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ 9వ వార్డుకు చెందిన 50మంది యాదవ సంఘ యూత్ నాయకులు పొలవెన మహేందర్, యాదవ సంఘ యూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో ఉత్సహంగా పనిచేసేందుకు స్వచ్ఛందంగా వచ్చిన యువతకు పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే గండ్ర ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. యువకులు అందరూ డ్రైవింగ్ లైసెన్స్ లు పొందని వారు జీఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా తీసుకోవాలని తెలిపారు. యువతకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏవైనా అవసరాలు ఉంటే క్యాంప్ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన యువకులు వంగ ప్రశాంత్, జీలా దిలీప్, ఒజ్జల రావణ, ఎం.జితెందర్, తొట్ల పవన్, బొడ్డు అనిల్, మేకల వెంకటేష్, వేల్పుల వెంకటేష్, తొట్ల సునీల్, జంగం మహేష్, బాషనవేన రామకృష్ణ, రాజు, తొట్ల రాకేష్, గుడ్డి ప్రశాంత్, మేకల శ్రీధర్, ఉల్లి మోషన్, సాగర్ల మహేష్, కొమ్ము శ్రీపాల్, మేకల రాజ్ కుమార్, కొమ్ము విజయ్, పొలవెన నిశాంత్, జీలా రాహుల్, మోతె బాలాజీ, రోహిత్, పోతనవేన రాజు, కన్నవేన రాహుల్ తదితరులు చేరారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్, 65వ డివిజన్ దేవన్నపేట గ్రామాల నుంచి శుక్రవారం వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, వర్ధనపేట శాసనసభ్యుడు అరూరి రమేష్ సమక్షంలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో 50మందికి పైగా చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని, రాబోయే ఎన్నికల్లో వర్ధన్నపేటలో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కష్ట పడాలని కార్యకర్తని కంటికి రెప్పలా కాపాడుకుంటు వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ కవితను కలిసిన ముప్పారం గ్రామస్తులు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** హైదరాబాద్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బంజారాహిల్స్ లోని వారి నివాసంలో శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆధ్వర్యంలో ముప్పారం గ్రామ ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశం పెట్టడంతో అందుకోసం పోరాటం చేసిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయం పునఃప్రాణప్రతిష్ఠ నవంబర్ లో చేయనున్నట్లు వారి దృష్టికి తీసుకెళ్లి ముహూర్తం నిర్ణయం చేశాక మరొకసారి వచ్చి ఆహ్వానం అందిజేస్తామని, అందుకు గాను చేపట్టిన ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను వారికి వివరించారు. అదే విధంగా ఈ సారి గ్రామంలో జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, సర్పంచ్ గొనెల సమ్మక్క రాజయ్య, ఉపసర్పంచ్ వేములకొండ రజిత భిక్షపతి, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మేకల విజయ్ కుమార్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొన్నే రవీందర్ రెడ్డి, దారపు రాములు, కోశాధికారి కుడితాజీ రవీందర్, జాయింట్ సెక్రటరీ అన్నం అశోక్, సులుగూరి భిక్షపతి, సాంబారాజు, కృష్ణంరాజు, కోరుకొప్పుల అనిల్, వల్లేపు మొగిలి, వార్డ్ మెంబర్ సతీశ్, పొనబోయిన వీరయ్య, చెల్లోజు నాగభూషణం, కందారపు రామకృష్ణ, మారబోయిన తిరుమల్, కందుకూరి రవి, గడ్డం చందు, గొల్లెన లింగయ్య, వజ్ర రాజాబాబు, గూళ్ల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శుక్రవారం 22, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వంట కార్మికులు కటిక దారిద్రంతో జీవిస్తున్న కూడా సకాలంలో బిల్లులు రాక వేతనాలు పెంచక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద తెలంగాణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా గడ్డం లలిత అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించుటకు హాజరు శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి 22 సంవత్సరాలు గడుస్తున్నా కనీస వేతన చట్టం అమలు నోచుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందున ప్రతి విద్యార్థికి రూ.25 రూపాయల చొప్పున చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అనేక డిమాండ్స్ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా తీవ్ర నిర్లక్ష్యం చేయడం వల్ల సమ్మె చేయాల్సి వస్తుందని ధర్మల రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్స్ పరిష్కారం అయ్యేవరకు ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, కార్మికులను పట్టించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొట్టేపాక రవి, బొంకూర్ ఐలయ్య, ఇందిర, వైనాల విజయ, లేక విజయ, బాసెట్టి అనిత, జనగాని లక్ష్మి, పుష్ప, ఎండీ మస్తాన్, తోకల రమ, వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటనను జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని దేవునిగుట్ట గ్రామపంచాయతీ నుంచి పంచాయితి రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తండా బాట పర్యటనలో భాగంగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మంత్రి పర్యటనలో తండా వాసులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు, బస్వా మల్లేశం గౌడ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ధరావత్ రామ్ సింగ్, అధికార ప్రతినిధి, గ్రామ ఇంచార్జి, సుడిగేల హనుమంతు, మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ గణేష్ నాయక్, గ్రామ సర్పంచ్ బాలు నాయక్, గ్రామ ఎంపీటీసీ యాకూబ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా పుణ్యం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విజన్ యూత్ రఘునాథ్ పల్లి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం రంగు పద్మావతి శ్రీనివాస్ దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని సుఖ సంతోషాలతో అందరూ బాగుండాలని కోరారు. యువకులు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విజన్ యూత్ సభ్యులు చింతకింది అశోక్, శివ, సురేష్, అనిల్, సతీష్, ప్రవీణ్, నరేష్, నవీన్, ప్రవీణ్, హరికృష్ణ, శ్రీకాంత్, రంజిత్, రాము, రమేష్, అన్వేష్, అజయ్, గ్రామ ప్రముఖులు జడ్పీటీసీ సభ్యులు అజయ్, మణికంఠ, ఎంపీటీసీ సభ్యురాలు పేర్ని ఉషా రవి, గాదె మహేందర్ రెడ్డి, రంగు రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చట్టసభలలో ఓబీసీ రిజర్వేషన్లపై ప్రధానికి లేఖ



**వరంగల్ వాయిస్, సుబేదారి :** చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి శుక్రవారం బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించిన బలమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించలేరా అని ప్రశ్నించారు. చట్ట సభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి దేశంలోని అన్ని పార్టీలు అనుకూలంగా ఉన్నాయి కాబట్టి చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే బాధ్యత మోడీ తీసుకోకపోవడం శోచనీయం అని అభిప్రాయపడ్డారు. చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయాలలో, అధికారంలో, పాలనలో మెజార్టీ ప్రజలకు భాగస్వామ్యం దక్కి సామాజిక న్యాయం కల్పించబడుతుందన్నారు. చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్ల కల్పనకు మోడీ చొరవ తీసుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేందర్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీపతి బాపు ఆధ్వర్యంలో "స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు" స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బస్టాండ్ ఆవరణలోని పబ్లిక్ టాయిలెట్స్ పరిసరాలు శుభ్రం చేయడం జరిగిందని, పిచ్చి మొక్కలు తొలగించడం జరిగిందని గ్రామ కార్యదర్శి సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల పేరుతో మోసం చేస్తున్న బీఆర్ఎస్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకాలను బీఆర్ఎస్ కండువా కప్పుకుంటేనే అందిస్తామని చెప్పి ప్రజలను, ఇతర పార్టీ కార్యకర్తలను మభ్యపెట్టి తమ పార్టీలో చేర్చుకుంటున్నారని బీజేపీ జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి అధికార పార్టీపై ఆరోపణలు చేశారు. తమ పార్టీలో చేరితే మాత్రమే మీకు పథకాలు అందుతాయని లేదంటే పథకాలు వర్తింపజేయమని బ్లాక్ మెయిల్ చేస్తూ పార్టీలో చేర్చుకోవడం వల్ల బీజేపీ, ఇతర పార్టీలకు ఎటువంటి ఇబ్బంది ఏర్పడదని ఆయన పేర్కొన్నారు. పథకాల పేరుతో కార్యకర్తలను చేసుకోవడం వల్ల బీఆర్ఎస్ పార్టీకి పెద్ద ఉపయోగ ఉండకపోవచ్చు అని కూడా ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు ఇతర పార్టీల కార్యకర్తలను బెదిరించి ప్రలోభాలకు గురిపెట్టి తమ పార్టీలో చేర్చుకోవడం మానుకోవాలని, లేదంటే గట్టి సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## ముగ్గుల పోటీలకు ఉత్తమ బహుమతులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్వీఎన్ రోడ్ లోని వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గజానన ఫైనాన్స్ కార్పొరేషన్ వారిచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు 30మంది బాలికలు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఉత్తమమైన ముగ్గులు ఎంపిక చేసి ప్రథమ బహుమతి రేణుక, ద్వితీయ బహుమతి మల్లేశ్వరి, కన్సోలేషన్ బహుమతి కుమారి కావ్యకు అందజేశారు. అలాగే ప్రోత్సాహకరంగా పాల్గొన్న మహిళలకు అందరికీ కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇందులో పాల్గొన్న మహిళలకు బహుమతులు పొందిన వారిని అభినందిస్తూ వీటితోపాటు వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా కళాకారులు ముఖ్యంగా బుర్రకథలు, హరికథలు, మిమిక్రీలు, పౌరాణిక నృత్యాలు తదితరములను ఏర్పాటు చేయాలని సభ్యులకు మనవి చేశారు. తణుకునూరి అశోక్, అల్లాడి అప్పారావు, సూర్యం, శ్రీనివాస్ తదితర కమిటీ సభ్యులతో పాటు అత్యధికంగా మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యం

### ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు.మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డోర్నకల్ నియోజకవర్గంలోని పేద ముస్లిం మహిళలకు మంజూరైన కుట్టుమిషన్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావుతో కలిసి పంపిణీ చేశారు. ముస్లిం, మైనార్టీల జీవితాలలో వెలుగులు నింపే విధంగా ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఎంపీపీ అరుణ రాంబాబు, జడ్పీటీసీ శారద రవీందర్, మున్సిపల్ చైర్మన్ సింధూర రవి, ఎంపీడీఓ కెలోతు దన్సింఘ్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను దగా చేసిన మోడీ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తొమ్మిదిన్నర సంవత్సరాలుగా బీసీలను నమ్మించి దగా చేసిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. పార్లమెంట్ లో పూర్తి మెజారిటీ ఉండికూడా బీసీనేనని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో తీరని అన్యాయమే జరిగిందన్నారు. చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టాలని ,కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, దేశ జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం బీసీలంతా దండు కట్టి సమరశంఖం పూరించాలన్నారు.

# సమాజ సేవలో ఉపేందర్ గుప్తా



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** సామాజిక సేవలో తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకుంటూ నిరంతరం ఏదో ఒక సేవ కార్యక్రమాన్ని చేస్తున్న పూర్వ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, వ్యాపారవేత్త కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తా రేణుక దంపతులను రఘునాథ్ పల్లి గ్రామస్తులు అభినందించారు. శుక్రవారం వారి మనుమరాలు జన్మదిన సందర్భంగా ప్రభుత్వ దావఖానలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నీటి శుద్ధి వాటర్ ఫిల్టర్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిండి శేఖర్ రెడ్డి, వేద కుమార్, లక్ష్మణ చారి పాల్గొన్నారు.

## యూబ్లడ్ ఆప్ పై అవగాహన



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** షైన్ రెసిడెన్షియల్ స్కూల్ ఎర్రగట్టు గుట్ట క్యాంపస్ లో షైన్ విద్యాసంస్థల చైర్మన్ ముగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు జక్కుల శ్రీనివాస్ యాదవ్, రాజేంద్ర కుమార్ యాదవ్, రమేష్ యాదవ్ సహకారంతో యూబ్లడ్ ఆప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షైన్ చైర్మన్ ముగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ యూబ్లడ్ ఆప్ అనేది కష్ట కాలంలో ప్రాణాపాయ స్థితిలో పేషెంట్ కు డోనర్ కు మధ్య వారధిగా పని చేస్తుందని, ఎమర్జెన్సీ సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యూబ్లడ్ ఆప్ అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యూబ్లడ్ ఆప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, మరో 10మందికి అవగాహన కల్పించాలని కోరారు. షైన్ డైరెక్టర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యూ బ్లడ్ ఆప్ అనేది ప్రతి నిరుపేద కుటుంబాలకు ఒక గొప్ప సంజీవని, పేదల ఆపన్న హస్తం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూబ్లడ్ ఆప్ ఫౌండర్ డా.జగదీశ్ బాబు యలమంచిలిని షైన్ విద్యాసంస్థల యాజమాన్యం, సిబ్బంది తరపున ప్రత్యేకంగా అభినందించారు. షైన్ డైరెక్టర్ రాజేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ సోనుసూద్ లాంటి సామాజిక సేవ బాధ్యత గల బాలీవుడ్ నటుడు ఈ యూబ్లడ్ ఆప్ కు బ్రాండ్ అంబాసిడర్ గా ఉండటంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరి మొబైల్ లో యూబ్లడ్ ఆప్ ఉండాలని కోరారు. యూబ్లడ్ ఆప్ విశిష్టత తెలుసుకొని షైన్ యాజమాన్యం, అధ్యాపక బృందం అక్కడికక్కడే వాళ్ల వాళ్ల మొబైల్స్ లో యూబ్లడ్ ఆప్ డౌన్ లోడ్ చేసుకొని లాగిన్ అయి మీడియాకు చూపించారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ : ఎస్సై అభినవ్



**వరంగల్ వాయిస్, కాటారం:** రౌడీ షీటర్లు చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కాటారం ఎస్సై అభినవ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలో నివసిస్తున్న రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో ఎస్సై అభినవ్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా రౌడీ షీటర్లు ఏ విధమైన అవాంతరాలు కలిగించరాదని, చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై అభినవ్ హెచ్చరించారు.

## మెడికల్ విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి:** మెడికల్ కాలేజీలో విద్యను అభ్యసించే విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం రామప్ప కాలనీలో మెడికల్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన హాస్టల్, కిచెన్ హాల్ ను జిల్లా కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో జాయిన్ కావడానికి వచ్చిన రాజస్థాన్ మెడికల్ విద్యార్థులతో మాట్లాడారు. అలాగే హాస్టల్ లో విద్యార్థులకు అనువైన మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం హాస్టల్ నుంచి కాలేజ్ వరకు ఎంత సమయం పడుతుందో కలెక్టర్ స్వయంగా నడుచుకుంటూ వెళ్లారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజు దేవుడే, జిల్లా కేంద్ర ఆసుపత్రి డీసీహెచ్ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో తెలంగాణే నంబర్‌వన్

### ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే ఓటు అడిగే హక్కు ఉందని పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల మండలంలోని 266, నడికూడ మండలంలోని 333, పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 362మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే ఓటు అడిగే హక్కు ఉందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల కథ కంచికి చేరిందనే విషయాన్ని మరిచిపోయి ప్రజలకు మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకోవడానికి వస్తున్నారని నిప్పులు చెరిగారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా చేయూతనందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఒక్కో నియోజకవర్గం పరిధిలో 3వేల మంది అర్హులకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. మొదటగా ఇంటి నిర్మాణ పనులు చేసుకున్న వారికి ఈ నెల ఆఖరులోగా మొదటి దఫా డబ్బులు వారి ఖాతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు ఎవరెన్ని కుట్రలు చేసినా, అసత్య ప్రచారాలు చేసిన గ్రామాల్లో ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ, పరకాల మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్లు, సభ్యులు, గృహలక్ష్మి లబ్ధిదారులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ గార్డెన్స్ లో వివిధ గ్రామాలకు చెందిన 432మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకం మహిళల పేరుపైనే ప్రవేశపెట్టింది. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3000 కేటాయించడం జరిగిందన్నారు. ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేస్తే విడతల వారీగా డబ్బులు కూడా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. వరంగల్ జిల్లాలో మొదటగా గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు పరకాల నియోజకవర్గంలో పంపిణీ చేసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, రైతుబంధు కన్వీనర్లు, సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థి ఉద్యమాలను అణిచివేస్తే సహించం

### ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు దూలం శ్రీనివాస్



వరంగల్ వాయిస్, తొర్రూరు : ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు దూలం శ్రీనివాస్, తీగల కృష్ణారెడ్డి లు పిలుపునిచ్చారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతిభవనంలో మండల సమితి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభల కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు దూరం శ్రీనివాస్, తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ అనుభవాలను వివరిస్తూ ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలకు నిర్మించామని, ఏఐఎస్ఎఫ్ బలోపతానికి మీరంతా కంకణ బద్దులు కావాలని సూచించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని ప్రముఖ విద్యావేత్త కొఠారి చెప్పారు కానీ, మన దేశ విద్య భవిష్యత్తు ప్రపంచ బ్యాంకు, రిలయన్స్, అదాని, అంబానీ లాంటి ఒప్పందాల్లో నడుస్తూ విద్యార్థులను సామ్రాజ్యవాదులుకు బానిసలుగా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయటానికి కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్, మహబూబాబాద్ జిల్లా సహ కార్యదర్శి పస్తం సాయికిరణ్, లకావత్ సతీష్, సందీపు, సురేందర్, నవదీప్ అన్వేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరు సహకార సంఘం మహాసభ విజయవంతం

### సభ్యులకు రూ.3.30 కోట్ల బోనస్ పంపిణీ




**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామంలో శుక్రవారం రోజున మాజీ ఎమ్మెల్యే, సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ లో 67వ మహాసభను సభ్యుల సమక్షంలో అధ్యక్షుడు అల్గిరెడ్డి విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం సంఘం నివేదిక గురించి చదివి వినిపించారు. తదనంతరం సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ సభ్యుల పంట అప్పుల కోసం ఎస్బీఐ నుంచి అప్పు తీసుకొనుటకు సంఘ కార్యవర్గానికి అధికారం ఇవ్వడం జరిగిందని అన్నారు. సంఘం సభ్యుల బోనస్ రూ.3.30 కోట్ల పంపిణీ చేశామని తెలిపారు. 2022 నుంచి 2023 సంవత్సరంలో ఖరీఫ్ 2022, రబీ 2023లో ఖరీదు చేసిన సభ్యుల వ్యవసాయ ఉత్పత్తులతో ఎస్ఎఓ ఎంటీఓ అప్పులు జమచేసుకున్న వారికి వరిధాన్యంపై క్వింటాకు 125/- వరి విత్తనాల పై 125/- పత్తి పై క్వింటాకు బోనస్ చెల్లించినట్లు తెలిపారు. సంఘ సీనియర్ సభ్యుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఏకే విశ్వనాథరెడ్డి వృద్దాప్య పెన్షన్ పథకం ఏప్రిల్ 2019 నుంచి అమలు పరిచామని అన్నారు. పంటమాఫీ కింద 127 మంది సభ్యులకు లక్ష ఇరవై ఐదు వేల చొప్పున మొత్తం 87 లక్షల రూపాయల మాఫీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల స్కాలర్ షిప్స్ కింద 91మంది గాను రూ.11.50లక్షలు అందించారు. వృద్ధాప్య పింఛన్ 619 సభ్యులకు రూ.42 లక్షల పింఛన్ అందజేసినట్లు తెలిపారు. ఈ పెన్షన్ వచ్చే సంవత్సరం నుండి 600 నుంచి 800 రూపాయలకు పెంచనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యుల దహన సంస్కారాల గురించి 172మంది సభ్యులు చనిపోగా రూ.25 లక్షలు దహన సంస్కారాల ఖర్చు కింద అందించారు. మొత్తం 2022-23 ఆర్థిక సంవత్సరం కింద 99శాతం వరకు అప్పులు వసూలు అయ్యాయని పేర్కొన్నారు. బ్యాంకు వ్యాపారం రూ.365 కోట్లు చేయగా ఏడు కోట్ల నికర లాభంలో దూసుకుపోతుందన్నారు. సంఘ సభ్యులకు జనతా ప్రమాద బీమా గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.2.75 కోట్ల ఇఫ్కో టోక్యో వారికి సంఘం స్వంత నిధులు చెల్లించినామని పేర్కొన్నారు. సంఘం సభ్యుల కంటి ఆపరేషన్లకు ఖర్చు చేశామని చెప్పారు. మొత్తానికి సంఘం సభ్యుల బోనస్ విజయవంతం గా పంపిణీ జరిగిందని, అనందం కలిగించే విధంగా సభ్యులు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు.

# క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్ జీఎఫ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ అండర్-17 బాల బాలికల క్రీడా ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి క్రీడలకు ప్రముఖ ప్రాధాన్యతని ఇస్తున్నదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ ఆటలతో పాటు చదువుల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. హనుమకొండ నగరం ఇప్పటికే ఎడ్యుకేషనల్ హబ్ గా, హెల్త్ హబ్ గా, స్పిరిచువల్ హబ్ గా మారిందని, స్పోర్ట్స్ హబ్ గా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. జేఎన్ఎస్ స్టేడియంలో మౌలిక వసతులను ఇప్పటికే పెంచామని తెలిపారు. క్రీడాకారులకు కావలసిన అన్ని సౌకర్యాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అనంతరం రెజ్లింగ్ ఆటను ప్రారంభించి ఆటను వీక్షిస్తూ ఆటగాళ్లను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, డీవైఎస్ఓ అశోక్ కుమార్, సారంగపాణి, క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య భవన్ కోసం స్థల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెద్దమ్మగడ్డ ఆజార హాస్పిటల్ పక్కన మత్స్య భవన్ కోసం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ తో కలిసిరాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ జిల్లా మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార భవనం కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించడంతో 1700గజాల స్థలాన్ని పెద్దమ్మ గడ్డలో కేటాయించడం జరిగిందని, నేడు పెద్దమ్మ గడ్డ స్థానికులు, మత్స్యకారుల సంఘం నాయకులు, ఫిషరీస్ విభాగం అధికారులు, రెవెన్యూ డిపార్ట్ మెంట్ అధికారులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించామన్నారు. స్థానికుల సహకారంతో స్థలాన్ని మత్స్య కారుల సంఘానికి కేటాయించి అధికారులకు వెంటనే స్కెచ్ మ్యాప్ ఏర్పాటు చేసి అతి త్వరలో జీవో విడుదల చేయించేలా కృషి చేస్తామన్నారు. ఈ స్థలాన్ని మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ , ఫిషరీస్ డిపార్ట్ మెంట్ అధికారులు, రెవెన్యూ డిపార్ట్ మెంట్ అధికారులు, మత్స్యకారుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈని కలిసిన పూర్వ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట దక్షిణ మధ్య రైల్వే డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్ కుమార్ ను కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుంచు అశోక్, మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో తమ బ్యాచ్ మెంట్స్ కలిశారు. స్వరాజ్ కుమార్ ఇటీవల మౌలాలి లోకో షెడ్ నుంచి బదిలీ పై కాజీపేట డీజిల్ లోకో షెడ్ లో సీనియర్ డీఎంఈ గా పదవీ బాధ్యతలు చేపట్టినందుకు గాను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సుంచు అశోక్, మర్యాల కృష్ణ మాట్లాడుతూ మాతో కలిసి చదువుకున్న మా తోటి మిత్రుడు అంచెలంచెలుగా ఎదిగి, ఈ రోజు సీనియర్ డీఎంఈ స్థాయిలో పుట్టిన ఊరిలో పదవీ బాధ్యతలు స్వీకరించినందుకు మాకు ఎంతో సంతోషంగా, అలాగే గర్వంగా కూడా ఉందన్నారు. సీనియర్ డీఎంఈ స్వరాజ్ కుమార్ మాట్లాడుతూ నా మిత్రుల చేతుల మీదుగా నాకు సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అలాగే చిన్న నాటి స్నేహితుల అందరితో కలిసి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొల్లికొండ వెంకటేష్, ఆలవాల అనిల్ కుమార్, పప్పుల గోవర్ధన్, పోతుల సాంబయ్య, మద్దెల రవీందర్, ఎండి మాక్సూదు, యాదగిరి, రావుల దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ ప్రతి కార్యకర్త ఒక సోషల్ మీడియా వారియర్గా మారాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్, టీఎస్ రెడ్కో చైర్మన్ వై సతీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు.డోర్నకల్ నియోజక వర్గ స్థాయి సోషల్ మీడియా అవగాహన సదస్సు డోర్నకల్ ఎమ్మెల్యే డియస్ రెడ్యానాయక్ ఆధ్యక్షతన నిర్వహించారు. ప్రజాసంక్షేమాలు బీఆర్ఎస్ ఆయుధాలు:ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రజాసంక్షేమాలు బీఆర్ఎస్ పార్టీ ఆయుధాలని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ప్రజల్లోకి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్ష నాయకుల ఆరోపణలను ప్రతీ కార్యకర్త తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సతీశ్ రెడ్డిని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రజాపతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, డోర్నకల్ బీఆర్ఎస్ యువనేత డీఎస్ రవిచంద్ర, వివిధ మండలాలు ఎంపీపీలు, జడ్పీటీసీలు, డోర్నకల్ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప కళాశాల ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని రాఘవేంద్ర నగర్ రోడ్ నెంబర్ 2లో శ్రీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామప్ప జూనియర్ కళాశాల డైరెక్టర్ కరుణాకర్ గౌడ్ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట విఘ్నేశుడికి పంచ భక్ష పరమాన్నాలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 400మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ మండల సమ్మయ్య, జగన్, గణేష్, విజయ్, అన్నదాతలు నాగేశ్వరరావు, లీలావతి, తేజస్వి, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల దీక్షలు ప్రభుత్వానికి కనబడటం లేదా



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లను తప్పించి యూనివర్సిటీ విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రైవేట్ యూనివర్సిటీ అధినేతల కనుసైగలో కేయూ వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్ లు పీహెచ్ డీ ఫలితాల్లో అవినీతి అక్రమాలు చేసి విద్యార్థులు చేస్తున్న దీక్షల పైన స్పందించకుండా ఉండడం దుర్మార్గమని విశ్వ బ్రాహ్మణ యూత్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు వేణు చారి అన్నారు. 17వ రోజు దీక్షలను విశ్వబ్రాహ్మణ యూత్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వేణు చారి విద్యార్థులకు పూలదండలు వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గత 20రోజుల క్రితం విడుదలైన పీహెచ్ డీ ఫలితాలలో అవినీతి అక్రమాలు జరిగాయని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్ లు కుట్రలు చేసి పోలీసుల చేత కొట్టించడం హేయమైన చర్యని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుల చేతిలో గాయపడ్డ కేయూ జాక్ నాయకులు కిరణ్, మాచర్ల రాంబాబు, ఆరేగంటి నాగరాజు, అంకిల్ల శంకర్, మట్టెడ కుమార్, జాక్ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి, మెడ రంజిత్, మందా వీరస్వామి, బి.నరసింహ రావు, తల్లాపెల్లి నరేష్, బొట్ల మనోహర్, ఎండీడ పాషా, గుండేటి సుమన్, తాటికాయల రమేష్, కాయిత నాగరాజు, భార్గవ్, జగదీష్, సంఘీభావం తెలిపిన వారిలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెద్దోజు వెంకటాచారి, షణ్ముకాచారి, సతీష్ ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

### ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, మడికొండ :** మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 46, 64వ డివిజన్లకు సంబంధించి మడికొండలోని రాజరాజేశ్వర గార్డెన్స్ లో 44,45వ డివిజన్లకు సంబంధించి భట్టుపల్లి ఆర్ఎన్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన మహిళా సంఘాల వార్షిక మహాసభకు ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదని, మహిళలు ఆత్మగౌరవంతో బతికే విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్ కు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షురాలు లలితా యాదవ్, స్థానిక కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ముత్తారంలో లక్ష్మి వెన్ ఫౌండేషన్ నుంచి రూ. 53లక్షల వ్యయంతో నిర్వాహకులు చందా రమేష్ రెడ్డి, నూతన భవన నిర్మాణంతో పాటు అధునాతనమైన సౌకర్యాలు కల్పించి నిర్మించిన పాఠశాల భవనాన్ని శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక పాఠశాలకు భవనం నిర్మాణంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినందుకు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్, శాతవాహన యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ ఛాన్స్ లర్ ఎండీ ఇక్బాల్, భీమదేవరపల్లి ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జడ్పీటీసీ సభ్యులు వంగ రవీందర్, భీమదేవరపల్లి తహసీల్దార్ వెంకట భాస్కర్, ఎంపీడీవో భాస్కర్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ శాంతి కుమార్, ముల్కనూర్ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి రాజిరెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంట్ వద్ద సినీ తారల సందడి..

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన మహిళా బిల్లును పార్లమెంట్ ఆమోదించటంతో సర్వత్రా హర్షం నెలకొంది. అన్ని పార్టీల మహిళలు ఈ బిల్లు ఆమోదించటం మీద హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి కార్యాలయం నుండి కొంతమంది నటీమణులకు ఢిల్లీ కి రావలసిందిగా ఆహ్వానాలు అందాయి. అందులో తెలుగు నుండి మంచు లక్ష్మి , తమన్నా భాటియా , ఖుష్బూ ఇంకా మిగతా పరిశ్రమల నుండి కూడా చాలామంది నటీమణులు వచ్చారు. ప్రధానమంత్రి కార్యాలయం లో వీరందరూ కలిపి ఒక ఫోటో కూడా తీసుకున్నారు. ఈ ఫోటోని ఖుష్బూ తన సాంఘీక మాధ్యమం అయిన ట్విట్టర్ లో షేర్ చేశారు. దానికి కేప్షన్ విమెన్ ఎన్పవర్మెంట్, విమెన్స్ రిజర్వేషన్ బిల్ 2023, న్యూ ఢిల్లీ అని ఇచ్చారు. వీళ్లందరినీ ఈ మహిళా రిజర్వేషన్ బిల్ ఆమోదం పొందినందుకు ప్రధాన మంత్రి కార్యాలయం నుండి పిలిపించారని, వీరితో ఆ బిల్ విషయం మాట్లాడవచ్చు అని తెలిసింది.

# దూకుడు మిస్ ..

ప్రతి సినిమాతో ఫ్యాన్స్ ని అలరిస్తున్న అజిత్ డిఫరెంట్ కథలతో వస్తుంటారు. తెలుగు దర్శకులు తమిళ హీరోలను డైరెక్ట్ చేయడం కొత్తేమి కాదు. అయితే అజిత్ ని డైరెక్ట్ చేసే అవకాశం ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల మిస్ చేసుకున్నారట. సూపర్ స్టార్ మహేష్ తో దూకుడుతో శ్రీను వైట్ల అందుకున్న సక్సెస్ ఏంటో తెలిసిందే. టాలీవుడ్ స్టార్స్ ని డైరెక్ట్ చేసిన శ్రీను వైట్ల అజిత్ ని డైరెక్ట్ చేసే అవకాశం వచ్చిందట. ఒకసారి అజిత్ ని కలిసినప్పుడు ఆయన దూకుడు సినిమా చూసి బాగా నచ్చిందని అన్నారట. కుదిరితే దాన్ని తమిళంలో రీమేక్ చేద్దామని అన్నారట. అయితే అజిత్ దూకుడు రీమేక్ కు రెడీ అని చెప్పినా ఆ టైం లో శ్రీను వైట్ల ఎన్.టి.ఆర్ తో బాద్షా సినిమా చేస్తుండటం వల్ల ఆ ఛాన్స్ వదులుకున్నారట. అయితే శ్రీను వైట్ల కాదనే సరికి అజిత్ కూడా దూకుడు రీమేక్ ని లైట్ తీసుకున్నారట.

ఏదైనా సినిమా ఒక భాషలో హిట్ అయితే ఆ డైరెక్టర్ అయితేనే ఏ భాషలో రీమేక్ చేసినా సరే న్యాయం చేస్తాడన్న నమ్మకం ఉంటుంది. అందుకే తెలుగులో కొన్ని తమిళ సినిమాలు రీమేక్ అయినా కూడా మాతృక దర్శకుడితోనే డైరెక్ట్ చేయిస్తారు. శ్రీను వైట్ల ఆ టైం లో ఫ్రీగా ఉండి ఉంటే అజిత్ సినిమా తన ఖాతాలో పడి ఉండేది. తమిళ దర్శకులు తెలుగు హీరోలతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు కానీ తెలుగు దర్శకులు తెలుగు మార్కెట్ దాటి బయటకు వెళ్లరు. ఎవరో ఒకరిద్దరు తప్ప ఇక్కడ సినిమాలు ఇక్కడ హీరోలతోనే సినిమాలు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం పాన్ ఇండియా మార్కెట్ ని శాసిస్తున్న టాలీవుడ్ లో వెరైటీ కాంబినేషన్స్ సెట్ అవుతున్నాయి. మరి ఈ క్రమంలో మళ్లీ శ్రీను వైట్లకి అజిత్ ని డైరెక్ట్ చేసే అవకాశం వస్తుందేమో చూడాలి. ఈమధ్య కెరీర్ పరంగా ఏమాత్రం ఫాం లో లేని శ్రీను వైట్ల రీసెంట్ గా గోపీచంద్ తో సినిమా ఫిక్స్ చేసుకున్నారు. ఈ సినిమాతో ఎలాగైనా తిరిగి ఫాం లోకి రావాలని చూస్తున్నారు.





# పూజల కోసం వెళితే..

## నటి సాయిపల్లవి పెళ్లిపై అసలు నిజం ఇదే



సాయి పల్లవి, దర్శకుడు రాజ్ కుమార్ పెరియాస్వామి పెళ్లి చేసుకున్నారు అని, ఇదే సాక్ష్యం అన్నట్లుగా దండలు వేసుకుని ఉన్న ఫోటోలను చాలా మంది షేర్ చేస్తున్నారు. సాయి పల్లవి ఈ మధ్య కాలంలో సినిమాలు కాస్త తగ్గించింది. పెళ్లి చేసుకోవడం కోసమే సాయి పల్లవి సినిమాలను తగ్గించి ఉంటుందేమో అంటూ కొందరు మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన పెళ్లి వార్తలు పూర్తిగా అవాస్తవం. ఒక సినిమా పూజా కార్యక్రమాల సందర్భంగా తమిళ్ సాంప్రదాయం ప్రకారం యూనిట్ సభ్యులు అంతా కూడా మెడలో దండలు వేసుకుని పూజ లో పాల్గొన్నారు. సాయి పల్లవి మరియు దర్శకుడు రాజ్ కుమార్ వరకు క్రాప్ చేసి చాలా మంది ఇద్దరి పెళ్లి అంటూ ప్రచారం చేస్తున్నారు. ఒబెనీ ఖీ।జీట – మల్లె తీగరోయ్ మనసే లాగుతోందిరోయ్..! శివ కార్తికేయన్ హీరోగా రూపొందుతున్న సినిమాలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుంది. ఆ సినిమా పూజా కార్యక్రమం సందర్భంగా మెడలో ఉన్న దండలతో కనిపించడంతో పెళ్లి వార్తలు మొదలు అయ్యాయి. సాయి పల్లవి తో విరాట పర్వం సినిమాను రూపొందించిన వేణు ఉడుగుల అసలు విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. ఇన్నాళ్లు బ్రేక్ తీసుకున్న సాయి పల్లవి మెల్ల మెల్లగా స్పీడ్ పెంచింది. తెలుగు లో చాలా కాలం తర్వాత నాగ చైతన్య హీరోగా అల్లు అరవింద్ నిర్మిస్తున్న సినిమా లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అధికారికంగా ఈ సినిమా ప్రకటన వచ్చింది. హీరోయిన్ గా ఇంత బిజీగా ఉన్న సమయంలో సాయి పల్లవి పెళ్లి చేసుకోవడం అనేది పూర్తిగా అవాస్తవం అని తెలిసినా కూడా జనాలు మాత్రం ఫోటోలు చూడగానే ఏదో ఉంది అన్నట్లుగా నమ్ముతున్నారు.





# కేబుల్ రెడ్డిగా వస్తున్న సుహాస్

ప్రముఖ నటుడు సుహాస్ తొలుత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తన కెరీర్ ని మొదలుపెట్టాడు. హీరో పక్కన రోల్స్ చేసే సుహాస్ సడెన్ గా కలర్ ఫోటో మూవీతో హీరోగా మారాడు. ఆ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కలర్ ఫోటో తో రూట్ మొత్తం మార్చేశాడు. ఆ సినిమాలో తన నటనతో అందరితో కన్నీళ్లు పెట్టించిన సుహాస్ తర్వాత హిట, సెకండ్ కేసులో విలన్ గా క్రూరత్వం చూపించాడు. ఆ తర్వాత ఈ ఏడాది మొదట్లో రైటర్ పద్మభూషణ్' సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. తాజాగా కేబుల్ రెడ్డి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యారు. ఈ సినిమాకి సుహాస్ స్నేహితుడు శ్రీధర్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాలో సుహాస్ సరసన షాలిని కొండేపూడి నటిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ మూవీకి మహిరెడ్డి పండుగల సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఈ చిత్రానికి స్మరణ్ సాయి మ్యూజిక్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. కాగా, ఈ మూవీ నుంచి తాజాగా సుహాస్ ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. మూవీ టైటిల్ లాగానే, ఫస్ట్ లుక్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంది. కేబుల్ రెడ్డి నవ్వులతో మీ గుండెకి కనెక్షన్ ఇచ్చేస్తాడు అంటూ క్యాప్షన్ కూడా జోడించారు. పోస్టర్ ను బట్టి సుహాస్ ఈ సినిమాలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేయనున్నట్లు తెలుస్తోంది. ఆయన వెనక చాలా టీవీలు ఉన్నాయి. ఒక్కో టీవీలో ఒక్కో ప్రోగ్రాం టెలికాస్ట్ అవుతోంది. క్రికెట్, సినిమా, సీరియల్ ఇలా అన్నీ చూపించారు. ఈ మూవీని వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీతో మరోసారి సుహాస్ హిట్ కొట్టడం పక్కా అనే ధీమాతో ఉన్నారు. అంబాజీపేట మ్యారేజి బ్యాండు అనే సినిమాలోనూ హీరోగా నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గోడ కూలి ముగ్గురు మృతి

## శాయంపేటలో విషాద ఛాయలు

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చైర్ పర్సన్ గండ్ర జ్యోతి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రమాదవశాత్తు ఇంటి గోడ కూలి ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం ఉదయం శాయంపేట మండల కేంద్రంలోని పోచమ్మ గుడి కాలనీలో జరిగింది. ముష్కే సురేష్ కు చెందిన ఇంటి గోడను అనుకొని చుట్టు పక్కల నివాసముంటున్న మోరే సాంబయ్య, లోకులబామ సారా లక్ష్మి, భోగి జయమ్మ ముచ్చటిస్తుండగా గోడ ఒక్కసారిగా కూలి వారిపై పడింది. దీంతో మోరే సాంబయ్య, సారా లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన జయమ్మను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా తుది శ్వాస వదిలారు. ఒకే ప్రాంతంలో నివాసముండే ముగ్గురు మృత్యువాత పడడంతో శాయంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం భయానకంగా కనిపించింది. విషయం తెలుసుకున్న





పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**మృతుల కుటుంబాలను పరామర్శించిన గండ్ర జ్యోతి..**

మృతుల కుటుంబాలను చైర్ పర్సన్ గండ్ర జ్యోతి పరామర్శించారు. పార్థీవ దేహాలకు నివాళులర్పించారు. ప్రమాద ఘటనపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. తనవంతు సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, సర్పంచ్ కందగట్ల రవి, ఎంపీటీసీ దైనంపల్లి సుమన్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# మూడు క్వింటాల లడ్డు బహూకరణ

వరంగల్ వాయిస్, కరీమాబాద్ : గణపతి నవరాత్రి ఉత్సవంలో భాగంగా శుక్రవారం ఐదో రోజు సందర్భంగా శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ రైల్వే గేట్ బీట్ బజార్ వరంగల్ లో ఏర్పాటు చేసిన గణపతికి వెంకటేశ్వర ఎలక్ట్రికల్స్ అధినేత పూల సమ్మయ్య బ్రదర్స్ ఆధ్వర్యంలో 300 కిలోల లడ్డును బహుకరించారు. అనంతరం గణపతి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎండి అలీ, అధ్యక్షుడు ఎ.రాజేందర్, ఉపాధ్యక్షులు ఎ.లక్ష్మీనారాయణ, టి.కుమార్, ప్రధాన కార్యదర్శి డి.లింగయ్య, కోశాధికారి ఎండి కాజా పాషా, పూజారి కోటయ్య శర్మ, కమిటీ సభ్యులు పూల రమేష్, పూల శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్‌లో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ కూరగాయల మార్కెట్ ఆధ్వర్యంలో మహన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం నాయకులు జారతి శ్రీనివాస్, బూరుగుపల్లి శ్రీనివాస్, కర్ర వెంకటేశ్వరరావు, మల్లూరి బాబురావు, బేతి అశోక్ బాబు, రేపల్లె రాజు, బేతి రాజు, కామారం రాజు, శీలం సత్యనారాయణ, పిన్న మల్లేశం, కారు హరినాథ్, పాటల రవి, భద్రయ్య, తోట సుధాకర్, వీరయ్య, వ్యాపారస్తులు, హమాలీలు, గుమస్తాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**ఎల్బీనగర్‌లో..**

నగరంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్ తారకరామ వీధిలోని స్వర్ణ భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోరంటల లక్ష్మి-రాజేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ ఎండి పుర్కన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ స్కూల్ అధినేత ఎస్.వెంకట్ రాజం దంపతులు, స్వర్ణ భారతి యూత్ అధ్యక్షుడు ఆకెన వెంకటేశ్వర్లు, సభ్యులు గాదె భిక్షపతి, ఆకెన రవి, గాజర్ల మధు, సర్వ సుధాకర్, ఆకెన కిరణ్, బండారి నరేష్, కొండి ప్రభాకర్, గాదె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మొసలిని బంధించారు





**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** నగరంలోని 31 డివిజన్ మారుతి హిల్స్ జూ పార్క్ వెనకాల పద్మాక్షి రోడ్ సమీపంలోని మురుగు కాలువలో గత కొంత మొసల్లు సంచారిస్తున్నాయి. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయంలో జూపార్క్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. జూ పార్కు నుంచి గతంలో కూడా మొసళ్లు, జింకలు తప్పించుకొని బయటికి వచ్చిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఎట్టకేలకు ఫారెస్ట్ అధికారులు శుక్రవారం మొసళిని బందించడంలో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగించకండి

## సీపీ రంగనాథ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

### హనుమకొండ చౌరస్తాలో పార్కింగ్ స్థలాల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హనుమకొండ చౌరస్తా, బస్టాండ్ జంక్షన్ లలో ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలో పార్కింగ్ ప్రాంతాలు, రోడ్డు వెడల్పుకు సంబంధించిన పనులను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. చౌరస్తాలో చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. పార్కింగ్ ప్రదేశాలను గుర్తించినట్లయితే చిరు వ్యాపారులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులుండవన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనం తర్వాత అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చీకటి ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి

## బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భవన నిర్మాణాల్లో టీఎస్ బి-పాస్ నిబంధనలు పాటించాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. శుక్రవారం టీఎస్ బి-పాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణాల స్థలాలను ఆయన పరిశీలించారు. అక్యుపెన్సి ధృవ పత్రాల జారీ కోసం నగర పరిధిలోని బాల సముద్రం, వికాస్ నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, టీచర్స్ కాలనీ, ప్రశాంత్ నగర్, ప్రకాష్ రెడ్డి పేట, ఐడియా స్కూల్ ప్రాంతం, న్యూ శాయంపేట జాగిర్, రంగంపేట తదితర ప్రాంతాలలో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటన నిర్వహించారు. టీఎస్ బి-పాస్ అనుమతి పొంది నిబంధనల మేరకు నిర్మాణాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, టీపీఓ బషీర్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com